సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,16 మే 2024


# జనసైనికుల సేవలు మరువలేనివి

## - జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ విజయం కోసం కృషి చేసిన జనసైనికులు, వీర మహిళల సేవలు ప్రశంసనీయమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు సత్య కృష్ణ ఫంక్షన్ హాల్ లో బుధవారం కార్యకర్తల కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పవన్ ప్రకటన వెలువడిన దగ్గర నుండి ఇవీఎంలలో ఆఖరి ఓటు పడేవరకు అలుపెరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద బలంగా నిలబడిన జన సైనికులు, వీర మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో జరిగే అన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు కృషి చేయాలని కోరారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గీతకు గౌరవం ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన అంతం కానున్నదని, జూన్ 4న వేడుకలకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి.మహేందర్ రెడ్డి, వేములపాటి అజయ్ కుమార్, మర్రెడ్డి శ్రీనివాస్, డాక్టర్ పంచకర్ల సందీప్, తుమ్మలపల్లి రమేష్, అనిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ఘన విజయం ఖాయం

- చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యం
- ప్రజలంతా కసితో కూటమికి ఓటేశారు
- కూటమి అభ్యర్థులు పంతం నానాజీ, టీటైం ఉదయ్ అత్యధిక మెజారిటీతో గెలుస్తున్నారు
- నియోజక వర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో తెదేపా, జనసేన, భాజాపా కూటమి విజయం ఖాయమని కాకినాడ రూరల్ నియోజక వర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. వలసపాకలలోని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి నివాసం వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్‌ఏ పిల్లి అనంతలక్ష్మి లు మాట్లాడుతూ...రూరల్ నియోజకవర్గంలో కూటమి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పంతంనానాజీఅత్యధికమెజారిటీతోవిజయం సాధించబోతున్నారని, జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మెజారిటీ ఓట్లతో గెలుస్తున్నారని, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఐదేళ్ళ పాటు రాష్ట్ర ప్రజలంతా ఎంతో నరకం చవి చూసారని, వైసిపి పాలనలో దౌర్జన్యాలు, దోపిడీ, అరాచకం, అన్యాయం, అక్రమాలతో విసిగి వేసారిన ప్రజలు జగన్‌పై కసితో పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాకూటమికి పట్టం కట్టే విధంగా ప్రజలు ఓటు వేశారన్నారు. దూర ప్రాంతాలనుండి ఎన్నో వ్యయాప్రయసల కోర్చి తమ తమ గ్రామాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం హర్షణీయమన్నారు. జగనాసురుడి పాలన నుండి విముక్తి పొందడం కోసం మే13న పోలింగ్ ప్రారంభానికి గంట ముందు వచ్చి మండుటెండనుసైతంలెక్క చేయకుండా ప్రజలంతా రోడ్లపైకి వచ్చి బారులు తీరి ఓటు వేశారని, కొన్ని కేంద్రాలలో సుమారు రాత్రి 11 గంటల వరకు ఓటర్లు ఓటు వేసారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసేందుకు ఇతర రాష్ట్రాల నుండి తమ స్వగ్రామాలకు పెద్ద ఎత్తున యువత తరలి రావడం గర్వించదగ్గ విషయం అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక పోలింగ్ శాతం నమోదు అయ్యిందని, దాన్ని బట్టి చూస్తేనే ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత అర్థం చేసుకోవచ్చని అన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున పిల్లి అనంత లక్ష్మి కి సీటు ఇస్తే మిగతా పార్టీలలోని అభ్యర్థులు ఎవరైనా ఓడిపోతారు అన్న పరిస్థితుల్లో కూటమి తరపున సీటు పొందిన జనసేన పార్టీ అభ్యర్థి నానాజీ ఐతే చాలా సులువుగా గెలిచేస్తాం అన్న ప్రత్యర్థుల మాటలను తలదన్నేలా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పంతం నానాజీని గెలుపు దిశగా తీసుకెళ్లినఘనత టిడిపికే దక్కుతుందన్నారు. తాము ప్రచారంలో ప్రజల వద్దకు వెళ్లి నానాజీకి ఓటు వేస్తే మాకువేసినట్టే అనిప్రతీఇంటికివెళ్లిఓట్లను అభ్యర్థించామన్నారు. పాలనపై అపార అనుభవం విజినరీ ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన వెనువెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. జూన్ 4వ తేదీన సంబరాలకు వేదిక కానుందని, రామరాజ్యం వస్తుందని, ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని, కేంద్రంలో ప్రధానిగా నరేంద్ర మోడి, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు గానీ పార్టీ శ్రేణులకు గానీ ఏ అవసరం వచ్చినా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీకి మద్దతుగా తమతో పాటు పెద్దయెత్తున ప్రచారంలో పాల్గొన్న తెదేపా, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు అలాగే రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి కూటమికి ఓటు వేసిన ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపర భగీరధుడు కాటన్ మహాశయుడు

### - ఆత్రేయపురంలో ఘనంగా కాటన్ జయంతి వేడుకలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** గోదావరి డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన అపర భగీరధుడు కాటన్ దొరని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఆత్రేయపురంలో సర్దార్ కాటన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), మాజీ ఎంపీపీ పి.ఎస్.రాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు కాటకాలతో అల్లాడే ఉభయగోదావరి జిల్లాలకు కాటన్ మహాశయుడు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ధవలేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మించి సాగునీటి వ్యవస్థను ఏర్పర్చిన మహనీయుడు కాటన్ సేవలతో గోదావరి డెల్టా ప్రాంతం ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి రామభద్రిరాజు, గాదిరాజు ప్రసాదరాజు, దండు రాంబాబు, తాడిపూడి భీమరాజు, సాగిరాజు సోమరాజు, ముదునూరి చంటిరాజు, శ్రీనివాసరాజు, వేగేశ్న సత్యనారాయణ రాజు, విశ్వనాధరాజు, ఎందుకూరి సీతారామరాజు, చేకూరి రమేష్ సుబ్బరాజు, రాంభద్రిరాజు, చిలువురి శ్రీనివాసరాజు, సత్తిరాజు, రబ్బిష్, తీగిరెడ్డి బాబి తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు పనుల్లో ఉపాధి కూలీలకు అస్వస్థత



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని బుధవారం ఉపాధి పనులు చేస్తున్న ఇరువురు కూలీలకు తీవ్ర అస్వస్థత ఏర్పడడంతో రాజవొమ్మంగి పి హెచ్ సి కి తరలించడం జరిగింది.తంటికొండ పంచాయితీ వట్టి గడ్డ గ్రామానికి చెందిన బొడ్డు సత్యవతి తంటికొండ గ్రామంలో జగ్గారెడ్డి చెరువు పనులు చేస్తుండగా అస్వస్థతకు గురవడంతో తోటి కూలీలు స్థానిక పిహెచ్సి కి తరలించగా వైద్యులు ప్రధమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అలానే బడదనాంపల్లి పంచాయతీ చిన్న రేలంగి పాడు గ్రామానికి చెందిన కరక సోమరాజు గ్రామంలోని సోమరాజు చెరువు పనులు చేస్తుండగా సోమరాజు అస్వస్థతకు గురవడంతో రాజవొమ్మంగి పి హెచ్ సి కి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఇరువురు పరిస్థితి బాగానే ఉన్నట్లు ఏ పి ఓ సురేష్ కుమార్ తెలిపారు.

## విజయవంతంగా ముగిసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు సమర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించి చిన్నారులకు పలు అంశాలలో శిక్షణను అందించినట్లు ట్రస్ట్ ట్రస్టీ వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు.కాకినాడ లోగల బరి నాగేశ్వరరావు పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ అర్చన సభా కార్యక్రమాన్ని నిర్వహించగా ట్రస్ట్ ట్రస్టీ వి.ఎస్.ఎన్.మూర్తి, భారతి, సత్యశాంతి ముఖ్యఅతిధిగాను ట్రస్ట్ సభ్యులు రామారావు, తాతారావు విశిష్ట అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ట్రస్టీ వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ బర్రి నాగేశ్వరరావు పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కాకినాడ పరిసర ప్రాంతాలలో విద్యా, వైద్యం, కెరియర్ గైడెన్స్ కాంపిటీ టివ్ ఎగ్జామ్స్ కోచింగ్ తోపాటు చలివేంద్రాలు, సూయింగ్ టైలరింగ్లో శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పేద విద్యార్థికి స్కాలర్ షిప్లను అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేసారు అదే విదంగా సమర్ కోచింగ్ క్యాంప్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ట్రస్టీ భారతి, సత్యశాంతి, సభ్యులు రామారావు, తాతారావు, సర్టిఫికెట్లు మెడల్స్ను బహుకరించారు. ఈకార్య క్రమంలో ఫ్యాకల్టీ శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, నాగేంద్రకుమార్, నాగబాబు, సుభద్రా, అన్నపూర్ణ వంశీ, వరలక్ష్మి, ప్రియాంక, వినయ్, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్

### - కొండెవరం గ్రామంలో సర్ ఆర్ధన కాటన్ జయంతి వేడుకలు



**యు.కొత్తపల్లి,మేజర్ న్యూస్ :** అపరభగీరధుడు, ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఆత్మబంధువు సర్ ఆర్థర్ కాటన్ అని కొండవరం గ్రామ నాయకులు గాది వెంకటరావు అన్నారు. యు.కొత్త పల్లి మండలం కొండేవరం గ్రామంలో జనరల్ సర్ ఆర్థర్ కాటన్ పుట్టినరోజు సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగానాయకులుగాదివెంకటరావు మాట్లాడుతూ... ఉభయగోదావరి ప్రజలు అతన్ని కాటన్ దొరగా పిలుచుకునేవారని, ఆయననిరంతరం ప్రజల సంక్షేమం, సేవ కోసమే పరితపించేవారని, గోదావరిపై నిర్మించిన ఆనకట్ట, ఉభయగోదావరి జిల్లాలలోని రైతుల ఆర్థిక, జీవనగతులను మార్చేసిందన్నారు. తమపాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణహితగా మార్చిన భగీరథుడుగా ఈ రెండు జిల్లాల ప్రజలగుండెల్లో నిలచిపోయారని కొనియాడారు. అడబాల అప్పలరాజు మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజి నిర్మించి 150 ఏళు గడిచినా గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ దొర ఇంకా చిరంజీవిగా ప్రజల మనసుల్లో ఉన్నారని అన్నారు. గంటా రఘు పూలదండ ను వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు ఈ కార్యక్రమంలో గాది శ్రీను, గాది భాస్కరరావు, బర్రె వీరభద్రరావు, గాది చక్రబాబు, గింగాల బాబ్జి, నాటక రచయిత బర్రె సత్యనారాయణ, మరియు గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

- కౌంటింగ్ పూర్తయ్యేవరకు 144 సెక్షన్
- సిసి కెమెరాల పర్యవేక్షణ, పోలీసు పహారా
- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షించేలా పోలీసుల పహరా ఉంటుందని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. ప్రజలు గాని ప్రజా ప్రతినిధులు గాని కాలేజీ లోపలికి రావడానికి జేఎన్టీయూ కాలేజ్ గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ ఇన్చార్జిని మరియు సంబంధిత పోలీస్ అధికారి పర్మిషన్ తీసుకోవలెనని, మరియు కౌంటింగ్ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమలులో ఉన్నదని తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ కాకినాడ జేఎన్టీయూ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవిఎం లకు రక్షణగా ఉన్న సిబ్బంది, ఇంఛార్జులకు పలు సూచనలు చేశారు. కాకినాడ జేఎన్టీయూ కాలేజీలో ఏర్పాటు చేయబడినటువంటి క్యాండిడేట్స్ / ఏజెంట్స్ స్ట్రాంగ్ రూమ్స్ వ్యూయింగ్ ఫెసిలిటేషన్ సెంటర్ ను సందర్శించి కాకినాడ ఎస్డిపిఓ డా. కె.హనుమంతరావు మరియు కాకినాడ ఎఆర్ అడిషనల్ ఎస్పీ డి.సత్యన్నారాయణ లకు స్ట్రాంగ్ రూములో ఈవిఎం ల భద్రత విషయంలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరియు జేఎన్టీయూ కాలేజీ చుట్టూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయమని సూచించారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ఈవిఎం గార్డ్సను, సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఏపీ మల్లవరంలో చోరీ

### - కిరాణా షాపులోకి ప్రవేశించి దోపిడి

**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలం ఏకే. మల్లవరం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఒక షాపులోకి దుండగులు చొరబడి లక్షా 35 వేల నగదు, సిగరెట్ పెట్లు మొబైల్ ఫోన్ చోరీ చేశారు. స్థానికులు సమాచారం మేరకు వివరాలు పరిశీలిస్తే... మల్లవరం గ్రామానికి చెందిన వివి.సుబ్రహ్మణ్యం తన ఇంటిలోనే కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. యధా ప్రకారం అమ్మకం అనంతరం షాపు మూసి నగదును షాపులోనే ఉంచారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దండగలు సుబ్రహ్మణ్యం ఇంటి వైపు వెనుక గోడ దూకి షాపులోకి ప్రవేశించి గళ్ళ పెట్టిలో గల లక్ష ముప్పై ఐదు వేల రూపాయలు నగదు, సిగరెట్ పెట్ బాక్స్, సెల్‌ఫోను దొంగిలించుకుని పోయారు. ఉదయాన్నే సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు ఇంటి పనులు నిర్వహిస్తుండగా షాపు తలుపులు తెరిచి ఉండడంతో అనుమానించి లోనికి వెళ్లి చూడగా డబ్బులు, సిగరెట్లు బాక్స్, సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించిన సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దొంగతనం జరిగిన తీరును సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాగా తెలుసున్నవారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# పెద్దాపురం ఏఆర్‌టి సెంటర్ నందు నమోదు ప్రక్రియ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి నందు గల ఎల్‌ఏసి + సెంటర్ నందు బుధవారం జిల్లా ఎయిడ్స్ మరియు లెప్రసి అధికారి డా.రమేష్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సతీష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఐసిటిసి సెంటర్ నందు పాజిటివ్ అయిన కేసులకు ఏఆర్‌టి మందులకు రిజిస్ట్రేషన్ ఇక్కడే చేసి మందులను ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఇప్పటివరకు రోగులకు కాకినాడ ఏఆర్‌టి సెంటర్‌కు వెళ్ళవలసి ఉండగా, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఇక్కడే నమోదు చేసి మందులను ఇచ్చే ప్రక్రియను మొదలుపెట్టడం జరిగిందని, తద్వారా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సిబ్బందికి మరియు లింక్ ఏఆర్‌టి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిలింగం, కాకినాడ ఏఆర్‌టి సిబ్బంది షేర్ ఇండియా ప్రతినిధులు, వైద్యులు డా.సూర్యకుమారి, జిల్లా నియంత్రణ సిబ్బంది రత్నరాజు, డా.విజయ్‌శేఖర్, డా.శ్రీ సత్య, హెడ్ సిస్టర్ రమాదేవి, ఏఆర్‌టి సెంటర్ డా.రత్నమణి, కమల కుమారి, షేర్ ఇండియా సిబ్బంది డా.క్రిస్టోఫర్, డా.ప్రభు, పిఓ చంద్రమౌళి, ఏఆర్‌టి కౌన్సిలర్ తలుపులమ్మ, ఏఆర్‌టి డేటా మేనేజర్ కృష్ణ, సుగంధి, ఐసిటిసి కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, ల్యాబ్ సిబ్బంది శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్

### -ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** డెల్టా ప్రాంత ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని, ఆయన చేసిన సేవలు మరువలేనివి అని అనపర్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా బుధవారం రామవరం గ్రామంలో స్థానిక కెనాల్ రేవులోని కాటన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయ అధికారిగా కాటన్ భారతదేశానికి వచ్చి గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల హిత బాధలు చూసి గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి డెల్టా ప్రాంతంలో పంట కాలువలు ఏర్పాటు చేసి డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి ప్రాంతాన్ని ఆంధ్రాకే అన్నపూర్ణగా నిలిపిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని అన్నారు. కాటన్ దొర మన దేశానికి వచ్చి ఉండకపోతే డెల్టా ప్రాంతమంతా ఇంకా ఎడారి గానే ఉండేదేమో అని అటువంటి డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన రైతు బాంధవుడు కాటన్ దొర అని,డెల్టా ప్రాంత ప్రజలకు దేవుడైన కాటన్ ను భవిష్యత్తు తరాలు కూడా గుర్తించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిరడా గంగ భవాని ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి గొలుగూరి గౌతమి మండల పార్టీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి పి హెచ్ సి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యురాలు కర్రి రుక్మిణి కుమారి,నల్లమిల్లి బుజ్జి, పార్టీ నాయకులు కర్రి సురేందర్ రెడ్డి, కర్రి మంగిరెడ్డినల్లమిల్లి రాజులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు జరగనున్నట్లు ఎంపీడీవో ఎల్ యాదగిరి ఈశ్వరరావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరుగునున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరవుతారని మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని అలా కాని యెడల ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

## డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ - నల్లమిల్లి




**అనపర్తి, మేజర్ న్యూస్ :** గోదావరికి ఆనకట్ట నిర్మించి డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలను బీడు భూములకు తరలించి పరివాహక జిల్లాలను సస్యశ్యామలం చేసిన రైతు బాంధవుడు కాటన్ దొర అని అన్నారు. డెల్టా ప్రాంత ప్రజల గుండెల్లో కొలువై ఉన్న మహనీయుడు కాటనని, నిస్వార్థ ప్రజా సంక్షేమ నిరతుడు కాటన్ దొర అని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం ఎన్డీఏ నాయకులు, అనపర్తి మండల ఎన్‌డిఏ నాయకులు, కార్యకర్తలు, రామవరం గ్రామ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పురంధరేశ్వరిని కలిసిన ఒప్పంద కార్మికులు



ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ 221 వ జయంతి సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి కూడలిలో ఉన్న కాటన్ విగ్రహానికి రాజమహేంద్రవరం బిజెపి లోక్ సభ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీఎన్టీయుసీ జిల్లా అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు ఆధ్వర్యంలో బ్యారేజి పై పనిచేసిన ఒప్పంద కార్మికులు గత పదమూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని,కంటింజెంట్, దినసరి కార్మికులు దశాబ్దాలుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదని విన్నవించారు. త్వరలోనే మీరు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆందోళన చెందవద్దన్నారని ధర్మరాజు తెలియజేశారు.

## గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలి



అలవరం, మేజర్ న్యూస్ : పి. గన్నవరం మండలం ఊడిమూడి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని భారతీయ జనతాపార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు యాళ్ల వెంకటరామమోహన్ రావు (దొరబాబు), ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమ కోరారు. ఈ సంఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.పి. గన్నవరం మండలం ఊడిమూడి వద్ద ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందా, నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. రహదారి పక్కన ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలు ఎగుమతి చేస్తుండగా, కూలీలను ఆర్టీసీ బస్సు ఢీకొంది.

## జెఎన్టీయుకెలో ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ 221వ జన్మదినోత్సవ వేడుకలు











కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, కాకినాడ లోకల్ సెంటర్ భవనం నందు ది.15.05.2024 బుధవారం ఉదయం సర్ ఆర్థర్ కాటన్ 221వ జన్మదినోత్సవ వేడుకలను జెఎన్‌టియుకె, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ మరియు రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ కాకినాడ (ఆర్ఐఇఎకె) ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత ముఖ్యఅతిథిగా విచ్చేయగా, గౌరవ అతిథిగా రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్.అర్జునరావు వేదికనలంకరించారు. కార్యక్రమానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ ఛైర్మన్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ & బయోటెక్నాలజీ విభాగాధిపతి డా. ఎం.రమేష్ అధ్యక్షత వహించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత మాట్లాడుతూ భావి ఇంజనీర్లు సర్ ఆర్థర్ కాటన్‌ను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ధవళేశ్వరం వద్ద ఆర్థర్ కాటన్ నిర్మించిన బ్యారేజీ వలన గోదావరి జిల్లాలు సస్యశ్యామలం అయ్యాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలోనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం ముదావహమన్నారు. ఇంజనీర్ ఎన్.అర్జునరావు మాట్లాడుతూ కాటన్ దార్శనికతను, సేవా తత్పరతను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ సెక్రటరీ డా.వి.జయప్రసాద్ కార్యక్రమానికి వందన సమర్పణ గావించారు.ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ సెక్రటరీ డా.వి.జయప్రసాద్, ఆర్ఐఇఎకె ప్రెసిడెంట్ ఇంజనీర్ ఎన్.కృష్ణారావు, సెక్రటరీ ఇంజనీర్ వి.కృష్ణారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన ఆర్‌ఓ





కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు బుధవారం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ లను సందర్శించారు. జేఎన్టీయూకే సివిల్ బ్లాక్ ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి ఇతర అంశాలపై ఎన్నికల అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఏఆర్‌ఓ చల్లన్నదొర ఉన్నారు.

**ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన ఓటర్లు : ఆర్వో**

ప్రస్తుత ఎన్నికలలో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు పేర్కొన్నారు. సిటీలో 72.07% ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. 2016 ఎన్నికలతో పోలిస్తే ఈసారి సుమారు 6% ఓటింగ్ శాతం పెరిగిందని ఆర్‌ఓ చెప్పారు. యువకులు, మహిళలు, వృద్ధులు చైతన్యవంతులై పెద్ద ఎత్తున తరలివచ్చి ఓట్లు వేశారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ బూత్‌లలో టెంట్ లు, మంచినీటి సదుపాయం వంటి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో సహకరించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

### స్ట్రాంగ్ రూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్

కాకినాడ, మేజర్‌న్యూస్ : సాధారణ ఎన్నికలు -2024కు సంబంధించి కాకినాడ జేఎన్టీయూలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్..జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు.జేఎన్టీయూలోని డా.బిఆర్. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా టీవీలను సెక్యూరిటీ సిబ్బంది వ్యవస్థను పరిశీలించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించి కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుకు అవసరమైన పనులు నిమిత్తం జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ఛాంబర్, మీటింగ్ హాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్యచి వుండే గది, ఇతర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జేఎన్టీయూ మెయిన్ గేటు నుంచి లోపలికి వచ్చే వారి వివరాలు పోలీస్ బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూ వద్ద బందోబస్తును మరింత పటిష్టం చేయాలన్నారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూము పరిశీలనకు వచ్చే రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్ట్రాంగ్ రూములకు వెళ్లే రూట్లను తెలియపరిచేవిధంగా మ్యేన్ గేటు వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## సమ్మర్ క్యాంప్‌లో ఫన్ని మ్యాథ్స్, క్రాఫ్ట్ శిక్షణ



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మే7 నుండి జరుగుతున్న సమ్మర్ క్యాంప్ 7వ రోజు కొనసాగింది. యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రవివర్మ విద్యార్థులకు ఫన్ని మ్యాథ్స్ బోధించారు. క్రాఫ్ట్ ఉపాధ్యాయిని విద్యార్థులకు కాగితాలతో పువ్వులను చేయించడం నేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, నమ్రత, అమృత, నాని, సాయి, బంగారం, నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద ఘటనపై హెూం మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి



గోపాలపురం, మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదంలో ఆరుగురు మరణించిన ఘటనపై హెూంమంత్రి తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు హెూంమంత్రి ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ మేరకు యర్నగూడెంలోని హెూం మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. చిలకలూరి పేట సమీపంలోని పసుమర్రు వద్ద హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టిప్పర్ లారీ ఢీకొట్టడంతో మృతి చెందారన్నవార్త తెలియగానే తన మనసును కలిచి వేసిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అపర భగీరథుడు కాటన్ మహాశయుడు - ఇఇ శేషగిరిరావు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : గోదావరి జిల్లాల అన్నదాతగా పేరుగాంచిన సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతిని బుధవారం పెద్దాపురం ఇరిగేషన్ కార్యాలయం వద్ద కార్యాలయ సూపరింటెండెంట్ సిహెచ్.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలేరు ఇఇ జి.శేషగిరిరావు పాల్గొని, కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవలేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, గోదావరి జిల్లాలు పరివాహక ప్రాంతాలను సశ్యస్యామలం చేసిన గొప్ప దార్శనీకులని కాటన్‌ను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.సత్యప్రసాద్, ఏఇ పి.వీరబాబు, టి.సాయిబాబు, వహీదా భాను, ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి పాలిక ఆర్థిక సాయం



కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : స్థానిక గైగల పాడు గ్రామానికి చెందిన, భర్తను కోల్పోయిన దొంగల పైడమ్మకి ఆ గ్రామానికి చెందిన మూర్తి స్కూల్ అధినేత, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పాలిక నరసింహమూర్తి రూ.10,000లు నగదు మరియు 2బస్తాలు బియ్యం, వితరణ ఇచ్చి ఆర్థిక సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు సహాయం అందించడం తన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుబ్బల విజయ్, మూర్తి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జయప్రద, రమ్యకృష్ణ, కాజల్ సందడి చేసిన జీ తెలుగు 19వ వార్షికోత్సవ వేడుక జీ మహోత్సవం

**-ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు..**





రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : 2023 తెలుగు టెలివిజన్ పరిశ్రమలో ప్రేక్షకులకు వినోదం పంచుతూ అగ్రగామిగా నిలుస్తున్న ఛానళ్లలో ఒకటి జీ తెలుగు. ఆసక్తికరమైన కథలతో, ఆకట్టుకునే కథనాలతో సాగుతున్న సీరియల్స్‌తో పాటు భిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న రియాలిటీ షోలు, ప్రత్యేక కార్యక్రమాలతో ప్రేక్షకులకు ఎనలేని వినోదాన్ని పంచుతున్న జీ తెలుగు విజయవంతంగా 19వ సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సరికొత్త కార్యక్రమాలతో అన్ని వయసుల ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా సాగుతున్న జీ తెలుగు 19 వసంతాల వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. తెలుగు టెలివిజన్ చరిత్రలో నూతన ఒరవడి సృష్టిస్తూ విజయపథంలో సాగుతున్న జీ తెలుగు19వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమం జీ మహోత్సవం మే 19న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో మాత్రమే..! తెలుగు ప్రేక్షకుల నుంచి అశేష ఆదరణ పొందుతూ విజయపథాన కొనసాగుతున్న జీ తెలుగు 19వ వార్షికోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఈ వేడుకలో జయప్రద, రమ్యకృష్ణ, కాజల్ అగర్వాల్ వంటి ప్రముఖ సెలబ్రిటీలు పాల్గొన్నారు. జీ తెలుగు 19 ఏళ్ల ప్రయాణం గురించి యాంకర్లు రవి, సిరి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సరదాగా సాగిన ఈవేడుకలో జూనియర్-సీనియర్ల మధ్య జరిగిన పోటీ ఆద్యంతం అలరిస్తుంది. సీనియర్ జట్టుకి జయప్రద, జూనియర్ జట్టుకి రమ్యకృష్ణ నాయకత్వం వహించారు. ఈ ఇద్దరి గ్రాండ్ ఎంట్రీతో ఘనంగా మొదలైన పోటీ డ్రామా జూనియర్స్ అంత్యాక్షరి స్కిట్, 1980, 1990 దశకాల్లోని హీరో హీరోయిన్ల గెటప్లతో సాగిన ప్రదర్శనలతో ఆసక్తికరంగా సాగింది. టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ సర్ప్రైజ్ ఎంట్రీ జూనియర్ టీమ్లో మరింత ఉత్సాహం నింపింది. ఈవేదికపై డ్రామా జూనియర్స్ పిల్లల అద్భుత ప్రదర్శనతో కె.విశ్వనాథ్, చంద్రమోహన్, శరత్ బాబు వంటి తెలుగు సినిమా దిగ్గజ కళాకారులకు నివాళులు అర్పించారు. అనంతరం నటి జయప్రద, రమ్యకృష్ణ వారితో తమ వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకోవడంతో పాటు సినీపరిశ్రమలో వారు పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు.
సరదా సాయంకాలాన్ని మరింత వినోదంగా మారుస్తూ జూనియర్స్, సీనియర్స్ బృందం తల్లీ కొడుకులు, అక్కా చెల్లెళ్ల బంధాలను ప్రతిబింబించే అద్భుత ప్రదర్శనతో అలరించారు. రమ్యకృష్ణ నటించిన పాపులర్ చిత్రం అమ్మోరును జూనియర్ టీం రీక్రియేట్చేసింది. యష్మి, ఇతర జూనియర్ టీం సభ్యులు రమ్యకృష్ణ జీవిత ప్రయాణాన్ని వర్ణించే ప్రదర్శనతో అబ్బురపరిచారు. 80, 90, వర్తమానాల్లో ఆల్ టైమ్ ఫేవరెట్హిట్స్ అయిన ప్రముఖ జీ తెలుగు షో సరిగమపలోని పాటలను సీనియర్లు, జూనియర్లు ఆలపించారు. వైభవంగా జరిగిన ఈ కార్యక్రమం పాత, కొత్త, గతం, వర్తమానాన్ని ఏకతాటిపైకి తెచ్చింది. ఈ వేడుక జీ తెలుగు 19 సవంవత్సరాల విజయవంతమైన ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది.

## బ్లేడ్ బ్యాచ్‌కు కఠిన కారాగార శిక్ష

**-సత్ఫలితాలు ఇస్తున్న ట్రయల్ కేసుల మానిటరింగ్ సిస్టం**

ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : దారిదోపిడీ కేసులో ముగ్గురు ముద్దాయిలకి 2 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 500- జరిమానా, జరిమానా కట్టని యెడల అదనంగా ఒక నెల రోజులు జైలు శిక్ష 5వ అడిషనల్ డిస్టిక్ సెషన్స్ జడ్జి డి. విజయ గౌతమ్ విధించారు. బరితెగిస్తే చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ పి. జగదీష్ హెచ్చరించారు.

**-కేసు వివరములు..** 2022 సంవత్సరం అక్టోబరు నెల 11 వ తారీఖున రాత్రి 9.00 గంటలకు ధవళేశ్వరం కంచర లైన్ మెయిన్ రోడ్15 సంవత్సరాల వయసు గల పిర్యాది ని ధవళేశ్వరానికి చెందిన ముద్దాయి లు (1) అప్పల బత్తుల కృష్ణవంశీ ఏ దొంగోడు, 22 సం॥, (2) కూరపాటి సతీష్ ఏ చేతబడి ఏ రాఖీ, 22 సం.లు, (3) ఉమ్మాడి సాయి గణేష్ ఏసాయి, 23 సం.లు అనువారు పిర్యాది తన తాతయ్య ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్ పై ధవళేశ్వరం బస్టాండ్ వద్దకు వెళ్లగా ముద్దాయిలు ఫిర్యాదును ఆపి అతనికి బ్లేడు లు చూపించి భయపెట్టి అక్కడినుండి ధవళేశ్వరం గవర్నమెంట్ హాస్పటల్ వద్దకు తీసుకొని వెళ్లి అక్కడ ఆటోలోకి లాక్కొని ఫిర్యాది జేబులో ఉన్న 100 రూపాయలు, అతని చేతికి ఉన్న వాచీని బలవంతంగా లాక్కొని చేతులతో మూతిపై శరీరంపై కొట్టి, మూతి పై రక్తపు గాయం కలుగజేసి, ఈ విషయం ఎవరికైనా చెప్పావంటే నిన్ను చంపి బ్యారేజీలో పడేస్తామని బెదిరించినారు. ఫిర్యాది అతి కష్టం మీద అక్కడనుండి అక్కడి నుండి తప్పించుకొని తన ఇంటికి వచ్చి అనంతరం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇవ్వగా ఇన్స్పెక్టర్ శ్రీమతి కే. మంగాదేవి కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేసి గౌరవ కోర్టు నందు ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది.తదుపరి జరిగిన విచారణ నందు జిల్లా అసిస్టెంట్ సెషన్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దిరెడ్డి శంభు ప్రసాద్ ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించగా, గౌరవ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి డి.విజయ గౌతమ్, కేసు విచారణ అనంతరం, ముద్దాయిలపై నేరం రుజువు అయినందున, ముద్దాయిలు ఒక్కొక్కరికి 2 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 500- జరిమానా విధిస్తూ ఈరోజు తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఒక ముద్దాయి ఇప్పటికే జైల్లో ఉండగా మిగతా ఇద్దరిని కూడా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. ఈ కేసు దర్యాప్తు లో శిక్ష పడడంలో ప్రాసిక్యూషన్ తరపున వాధించిన పబ్లిక్ ప్రాసిక్యుటర్ పెద్దిరెడ్డి శంభు ప్రసాద్‌ని, దర్యాప్తు అధికారి అయిన అప్పటి ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కే మంగాదేవిని మరియు ఈ కేసు ట్రైల్ ప్రాసెస్ ను ఎప్పటికప్పుడు మానిటర్ చేసిన సౌత్ జోన్ డిఎస్పి ఎం. అంబికా ప్రసాద్, పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వినయ్ మోహన్ మరియు కోర్టు ఎఎస్సై జి. వెంకటేశ్వర్లు ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## రాజకీయపార్టీలు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

**-జగన్నాథపురంలో మంగళవారం రాత్రి తెదేపా, వైసీపీ మధ్య గొడవ**

**-డీఐజీ దృష్టికి తీసుకువెళ్లిన హెూంమంత్రి -ఆ గ్రామాన్ని సందర్శించిన డీఐజీ**



గోపాలపురం, మేజర్ న్యూస్ : రాజకీయ పార్టీలు వ్యక్తిగత దూషణలు, ఒకపార్టీపై మరొక పార్టీ దాడులకు పాల్పడం, గొడవలు పడడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి అశోక్‌కుమార్ హెచ్చరించారు. గోపాలపురం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో మంగళవారం అర్థరాత్రి తెలుగుదేశం, వైసీపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు గొడవలకు దిగారు. ఈ నేపథ్యంలో వివాదం తీవ్రతరమయ్యే అవకాశం ఉన్నదని భావించిన హెూం మంత్రి తానేటి వనిత డీఐజీ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం ఈ నేపథ్యంలో డీఐజీ బుధవారం సాయంత్రం గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కూడా సందర్శించారు. అనంతరం గోపాలపురం పోలీసు స్టేషన్లో విలేకర్లతో మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు సమస్యాత్మక గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన పనులు చేస్తే కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. పార్టీల మధ్య వివాదం తలెత్తే వ్యాఖ్యలు చేస్తే పార్టీలతో సంబంధం లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఫలితాలు పూర్తయ్యే వరకు జగన్నాథపురం వద్ద చెక్‌పోస్టును కొనసాగిస్తామని చెప్పారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పార్లమెంటు నియోజకవర్గంలో 80.93 శాతం ఓటింగ్

- గోపాలపురం నియోజకవర్గంలో 86.67 శాతం
- రాజహేంద్రవరం సిటీలో అల్పం.. రాజానగరంలో అధికం
- అధికారిక లెక్కలను ప్రకటించిన ఈసీ



గోపాలపురం, మేజర్ న్యూస్ : రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ నెల 13 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 80.93 శాతం ఓటింగ్ నమోద్కెంది. బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక లెక్కలను ప్రకటించింది. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గంలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా రాజమహేంద్రవరం గ్రామీణంలో 73.02శాతం, రాజమహేంద్రవరం నగరంలో 67.57శాతం, రాజానగరంలో 87.53శాతం, అనపర్తిలో 86.23శాతం, కొవ్వూరులో 85.9శాతం, నిడదవోలులో 84.67శాతం, గోపాలపురంలో 86.67శాతం ఓటింగ్ నమోద్కెంది. అన్ని నియోజకవర్గాల్లో అర్థరాత్రి దాటిన తర్వాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఈవీఎం మెషిన్లు కొన్ని చోట్ల మొరాయించడం..మరికొన్ని చోట్ల మెషిన్లు మందకోడిగా పనిచేయడం వంటి కారణాల వల్ల పోలింగ్ పూర్తికావడం ఆలస్యం అయ్యిందని అధికారులు చెబుతున్నారు. ఈవీఎంలను రాజానగరంలోని నన్నయ్యవిశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరచి, అక్కడ మూడంచెల భద్రత కల్పించినట్లు గోపాలపురం నియోజకవర్గ ఆర్‌వో కె.శివజ్యోతి తెలిపారు.